31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
మంగళవారం 03 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,ఫిబ్రవరి 2 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 7మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగామాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

### అధికార కాంగ్రెస్ టిక్కెట్లు

# దక్కేది ఎవరికో..?

చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 2 : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోరులో భాగంగా నేడు మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉండగా, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బి-ఫాంల పంచాయితీ ఇంకా కొలిక్కి రాకపోవడంతో బరిలో నిలిచే అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ల మధ్య కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితితో కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్లు వేసిన అభ్యర్థులు భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. అయితే ఇటీవలే టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జగిత్యాలలో పర్యటించి టిక్కెట్ల పంచాయితీపై ఓ కూర్పు తీసుకవస్తారని అంతా భావించినప్పటికీ నామినేషన్ల ఉపసంహరణకు గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ బి-ఫాంలు ఎవరికి కేటాయిస్తారో స్పష్టత రాకపోవడం జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



**అధికార కాంగ్రెస్ టిక్కెట్లు దక్కేది ఎవరికో..?**

జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పని చేస్తున్నానని ప్రకటించడంతో జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తనకు ప్రత్యర్థి అయిన డా.సంజయ్ కుమార్ కు పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ఎలా అవకాశం ఇస్తారని ఇటీవలే గాంధీభవన్ వేదిక జరిగిన ఎన్నికల సమీక్షా సమావేశంలో మంత్రులు, టిపిసిసి నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసి సమావేశాన్ని బహిష్కరించి, కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకే మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయించాలని తేల్చి చెప్పారు. దీంతో జగిత్యాల నియోజకవర్గంలో జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ బి-ఫాంల పంచాయితీని ఒ కొలిక్కి తీసుకవద్దామని కాంగ్రెస్ పార్టీ అదిష్టానం టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ను జగిత్యాలకు పంపించగా, ఆయన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తో కలిసి సమావేశాన్ని నిర్వహించి సీనియర్లు, జూనియర్లు అందరు కలిసి పని చేయాలని, పార్టీ నిర్ణయాన్ని ఎవరు వ్యతిరేకించిన వారిపై చర్యలు తప్పవని చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా జీవన్ రెడ్డి వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే నేటితో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనుండగా జగిత్యాలలోని 50 వార్డుల్లో, రాయికల్లోని 12 వార్డుల్లో ఇటు మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గీయులు, అటు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ వర్గీయులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసి బి-ఫాం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో టిక్కెట్ల పంచాయితీ ఇంకా కొలిక్కి రాకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ×

**35 జీవన్ రెడ్డి వర్గానికి...15**
**ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి..?**

టిక్కెట్లు ఎవరికి కేటాయించిన....తప్పని రెబల్స్ బెడద.... కాంగ్రెస్ పార్టీ అదిష్టానం జగిత్యాల మున్సిపాలిటీలోని 50 వార్డుల్లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గానికి 35 టిక్కెట్లు, ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ వర్గానికి 15 టిక్కెట్లు కేటాయిస్తారని గుసగుసలు విన్పిస్తున్నాయి. అయితే జగిత్యాల మున్సిపాలిటీలోని 50 వార్డుల్లో ఇటు మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గీయులు, అటు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ వర్గీయులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారు. రెండు వర్గాల్లో ఏ వర్గానికి బి-ఫాం కేటాయించిన ప్రతి వార్డులో అధికార కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ బెడద తప్పేలా లేదు.

**పట్టు వీడని మాజీ మంత్రి జీవన్ రెడ్డి.....**

కాంగ్రెస్ పార్టీ 10 ఏళ్లు అధికారంలో లేకపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, నాడు బిఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేసి జెండా మోసిన కాంగ్రెస్ కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు వ్యాఖ్యనించారు. తన వర్గీయులకే బి-ఫాంలు కేటాయించాలని ఇటీవలే గాంధీ భవన్ వేదిక జరిగిన సమావేశంలో సైతం జీవన్ రెడ్డి తేల్చి చెప్పగా, సోమవారం జరిగిన పార్టీ జూమ్ మీటింగ్ లో సైతం ఇదే అంశాన్ని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం.

### పకడ్బందీ ప్రణాళిక ప్రకారం

# శివరాత్రికి వసతులు కల్పించాలి





**-సమన్వయంతో జాతర వేడుకలు విజయవంతం చేయాలి**
**-మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమన్వయ సమావేశం**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 02 :** మహా శివరాత్రి జాతరకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఆయా శాఖల అధికారులు వసతులు కల్పించాలని జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా -2లో

### ఎన్నికల రోజు ప్రిసైడింగ్

# అధికారుల పాత్ర కీలకం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 2 :** ఎన్నికల రోజు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖర్దాడే కాళీచరణ్ సుదామా రావు అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులకు, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎన్నికల సాధారణపరిశీలకులు ఖర్ధాడే కాళీచరణ్ సుదామా రావు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తో కలిసి శిక్షణ తరగతులను పరిశీలించి పలు అంశాల మీద ప్రిసైడింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖర్దాడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల విధులు చాలా కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ -2లో

## పెగడపల్లి రాజన్న ఆలయంలో బహిరంగ టెండర్లు



**చురకలు విలేఖరి పెగడపల్లి, ఫిబ్రవరి 02 :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగ టెండర్లను నిర్వహించారు. ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దుకాణాలలో విక్రయించే టెంకాయలు, బెల్లం, లడ్డు, పులిహోర వంటి వాటికి బహిరంగ టెండర్లను, ఆలయంలో కొబ్బరి ముక్కల సేకరణకు బహిరంగ టెండర్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వేలం పాటలో కొబ్బరికాయలు, బెల్లం దుకాణాల నిర్వహణకు 1,65,116 రూ.లకు రేగూరి రాజేశం, లడ్డు, పులిహోర దుకాణాల నిర్వహణకు 1,10,116 రూ.లకు అనంతుల మునీందర్, కొబ్బరి ముక్కల సేకరణకు 26,516 రూం.లకు రాచకొండ వెంకటేశం దక్కించుకున్నారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం ద్వారా మొత్తం 3,01,748 రూ.లు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేల పాటలో వ్యాపారస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ శాశ్వత సభ్యులు, శివ దీక్షాపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించిన ఆర్.జి-3 జి.ఎం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 2.**

జనవరి నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.వారు మాట్లాడుతూ జనవరి నెలలో రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 6.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 3.79 లక్షల టన్నులు అనగా 63 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, కంపనీ డిపార్ట్మెంట్ షావల్స్ కు నిర్దేశించిన 12.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి)వెలికితీత లక్ష్యానికి గాను, 14.21 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 114 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అలాగే ఆఫ్ లోడింగ్ కు నిర్దేశించిన 48 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 16.26 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి వెలికి తీసి 34 శాతం సాధించిందని, అదేవిధంగా 6.06 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ జనవరి నెలలో ఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 3.20 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.30 లక్షల టన్నులు అనగా 41 శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.80 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.49 లక్షల టన్నులు అనగా 89 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిషత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల భద్రతే ఆపరేషన్ స్మైల్ లక్ష్యం

**-పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**
**-అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్XII విజయవంతం**
**-కమీషనరేట్ పరిధిలో 166 మంది బాలలు విముక్తి, 20 కేసులు నమోదు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది.ఈ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, వదిలివేయబడిన,అలాగే కిరాణా దుకాణాలు,మెకానిక్ షాపులు,హోటళ్ళు, వివిధ కంపెనీలు మరియు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా అవసరమైతే చిల్డ్రన్ హోమ్‌లకు పంపించడం జరుగుతుంది.దీనిలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఆపరేషన్ స్మైల్XII కార్యక్రమాన్ని పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు,సిబ్బంది, అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,హెల్త్ డిపార్ట్మెంట్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్, ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండము కమీషనరేట్ పరిధిలో ప్రతి డివిజన్‌కు ఒక ఎస్.ఐ మరియు నలుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సంవత్సరం జనవరి 1నుండి 31వరకు కమీషనరేట్ వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్XII కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగా,మొత్తం (166)మంది బాల బాలికలను గుర్తించినట్లు వెల్లడించారు.పెద్దపల్లి జిల్లా పరిధిలో బాలురు30,బాలికలు 18,మొత్తం 48 మందిని గుర్తించి,05 కేసులు నమోదు చేసి 05 మందిని అరెస్ట్ చేయడం జరిగింది.మంచిర్యాల జిల్లా పరిధిలో బాలురు 93,బాలికలు 25,మొత్తం 118 మందిని గుర్తించి,15 కేసులు నమోదు చేసి 15 మందిని అరెస్ట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు గానీ, బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లు గానీ, లేదా తప్పిపోయిన, వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.బాల కార్మికులను నియమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయడంలో పోలీస్ శాఖతో కలిసి కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు.

# ఎన్నికల రోజు ప్రిసైడింగ్...

**మొదటి పేజీ తరువాయి.....**నింపడం, అన్ని ఫార్మ్లు ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్, తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలనే బాధ్యత పీఓలకు ఉందని జిల్లా అదనపు కలెక్టర్ × పేర్కొన్నారు. పోలింగ్ రోజు రోజు అనుసరించాల్సిన విధివిధానాలు, పోలింగ్ స్టేషన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్కు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు ఎలక్షన్ డ్యూటీ అత్యంత బాధ్యతతో నిర్వహించాలని, ప్రతి పీఓ తమ పాత్రను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి పివో తమ ఏపివోలతో సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో టివోటిలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పివోల విధులు, బాధ్యతలు ఎన్నికల్లో తీసుకోవల్సిన జాగ్రతలపై పూర్తి స్థాయిలో వివరించారు. ఆర్డీవోలు మధు సూదన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, నోడల్ అధికారులు రాము, రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, మున్సిపల్ కమిషనర్లు, టి వో టి లు పాల్గొన్నారు.

# శివరాత్రికి వసతులు...

**మొదటి పేజీ తరువాయి....** శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించగా, జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే, ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు.వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు, హెలిప్యాడ్ వద్ద, ఇతర చోట్ల బారికేడింగ్ పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ ఏడాది 600 బస్సులు ఏర్పాటు చేస్తామని, ఇంకా భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలు అందుబాటులో పెడుతామని ఆర్టీసీ ఆర్ఎం తెలిపారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆద్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ, ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు అల్పాహారం చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా అద్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని, వేములవాడ ఏరియా హాస్పిటల్, సిరిసిల్ల జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నాంపల్లి వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, ఏర్పాట్ల కల్పనకు ఇద్దరు అధికారులను నియమించామని వివరిం చారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. వేములవాడలో లాడ్జ లలో అద్దెలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాతరలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగిం చకుండా చూడాలని, క్యూ లైన్ల వద్ద తాగునీటిని స్టీల్ గ్లాస్ లలో ఇవ్వాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు.

# వివాదస్పదంగా శివాజీ విగ్రహ ఏర్పాటు

**-విగ్రహాన్ని అడ్డుకునేందుకు కుట్రపన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని**
**-ఆదివారం రాత్రి ధర్నాకు దిగిన గ్రామస్తులు, మహిళలు**
**-సర్పంచ్ భాస్కర్ రెడ్డి, పలువురి జోక్యంతో విగ్రహం ఏర్పాటు**







**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం పిబ్రవరి (02) :** శివాజీ విగ్రహం ఎర్పాటు లో వివాదస్పదం నేలకోంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామంలో అదివారం రాత్రి 9 గంటలకు గ్రామస్తులు,యువకులు దర్నచేశారు. స్థానిక సర్పంచ్ కాశిరెడ్డి బస్కర్ రెడ్డి, పలువురి జ్యోక్యం తో శివాజీ ఎర్పాటు జరిగింది. వివరాలోకి వెల్లితె గ్రామం లోని అన్ని పార్టీల సహకారంతో గ్రామ యువకులు గాంది చౌక్ వద్ద రెండు నెలల క్రితం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఎర్పాటు కోసం గద్దెను నిర్మాణం కోసం నిర్ణయం చేసుకోని ప్రతిష్టాపించడానికి సిద్దం చేసుకున్నరు. ఈమేరకు అదివారం విగ్రహం తిసుకు వచ్చే క్రమంలో డిజె ను ఎర్పాటు చేసున్న క్రమంలో మండల స్థాయి అదికారులకు పలువురు గ్రామస్తులు విగ్రహం ఎర్పాటు చేయటం ,విగ్రహం రాకుండా ఉండలని పోన్ ధ్వార సమాచారం ఇచ్చారు.దింతో పోలిసులు డిజె వద్దనటంతో గ్రామస్తులు దర్న చేశారు. పలువురు జ్యోక్యంతో విగ్రహాన్ని ఎర్పాటు కు సహకారించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పలువురు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఫిబ్రవరి (02) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని పకీర్ కొండాపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భుమిపుజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట రమేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు సింగాని మారుతి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా వనజ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఫిబ్రవరి (02) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల వైద్యాధికారిగా డాక్టర్ వనజ సోమవారం భాధ్యతలను స్వికరించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రనీకీ డాక్టర్ వనజ రావడం తో సిబ్బంది సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి తీరని నష్టం

**-మొహమ్మద్ సులేమన్ అధ్యాపకుని మృతి పట్ల విద్యావేత్తల సంతాపం**



**చురకలు ప్రతినిధి, కోరుట్ల, జనవరి,02 :** కోరుట్ల పట్టణం రహీంపురాకు చెందిన విద్యారంగంలో గొప్ప పేరు ప్రతిష్టలు సంపాదించిన ప్రముఖ అధ్యాపకుడు మొహమ్మద్ సులేమన్ ఈ రోజు మన మధ్య లేకపోవడం విద్యారంగానికి తీరని నష్టమని పలువురు విద్యావేత్తలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఎం.ఏ.నయీం,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌసూర్ రెహమాన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.ఏ.వాజీద్, ఉపాధ్యాయుడు ఎం.ఏ.లతీఫ్ మాట్లాడుతూ సులేమన్ అధ్యాపకుని మృతి వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని పేర్కొన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కోరుట్ల ప్రజలు విద్యారంగంలో ఒక ఆణిముత్యాన్ని అమూల్యమైన వజ్రాన్ని కోల్పోయారని వారు తెలిపారు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో పలకరిస్తూ, ప్రేమాభిమానాలతో అందరితో మమేకమై ఉండే వ్యక్తిగా సులేమన్ అందరి హృదయాల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు.ప్రత్యేకంగా పేద కుటుంబాల పిల్లలకు విద్య ద్వారా కలిగే లాభాలను వివరించి,సమాజంలో విద్య మనిషి జీవితంలో ఎంత అవసరమో అవగాహన కల్పిస్తూ పిల్లలు పాఠశాల లకు నిత్యం వెళ్లే శ్రద్ధతో చదువుకునేలా ప్రోత్సహించడంలో ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు.సులేమన్ అధ్యాపకుని సేవలు ఎప్పటికీ మరువ లేనివని ఆయన స్మృతి విద్యారంగంలో చిరస్థాయిగా నిలిచి పోతుందని వారు పేర్కొన్నారు.

## విద్యలో విద్యార్థుల దినదినాభివృద్ధి

# ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది




**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఫిబ్రవరి 2 :** విద్యార్థులు విద్యలో చూపించే దినదిన అభివృద్ధి వారు ఎంచుకున్న లక్ష్యాలకు చేర్చడానికి దోహదపడుతోందని వ్యక్తిత్వ వికాసాన్నిపుణులు కెప్టెన్ డాక్టర్ లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ గొల్లపల్లి, లీడ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోటివేటివ్ స్పీకర్ కెప్టెన్ లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. విద్యార్థులు చెడు అలవాట్లను త్వరగా గ్రహిస్తారని వాటికి దూరంగా ఉండి వారు ఏర్పరచుకున్న లక్ష్యాలను చేరడానికి ప్రతినిత్యం కష్టపడాలన్నారు. రోజులోని 24 గంటల్లో పాఠశాలకు ఎనిమిది గంటలు నిద్రకు ఎనిమిది గంటలు పోగా మిగిలిన ఎనిమిది గంటల్లో ఎక్కువ సమయాన్ని విద్య కోసం కేటాయిస్తారో వారే ఉన్నత లక్ష్యాలను చేరుకొని ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. విద్యార్థి తనను తాను తెలుసుకొని తనలో దీని చెడు లక్షణాలైనా అలసత్వం, సోమరితనాన్ని దూరం చేసుకుని తనను తాను జయించినప్పుడే విజయాలు తనకు దాసోహమైతాయన్నారు. ఇప్పుడు టెన్త్ చదువుతున్న మీరు మరో ఆరు సంవత్సరాలలో మీరు పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండి అందరికీ ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థుల్లో పోబియో ఉంటుందని పరీక్షలు అంటే భయం లేకుండా చదివిందాన్ని పరీక్షల్లో నాయాలన్నారు. ఉన్నత చదువులకు 10వ తరగతి ఒక మెట్టు మాత్రమే అని పదవ తరగతి మార్కులతో సాధించేది ఏమీ లేదని విద్యార్థులు పాఠాలను బట్టి పట్టకుండా ప్రాక్టీస్ ద్వారా విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ట్రైనింగ్ మేనేజర్ తాడూరి శ్రీనివాస్, జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ అంజనా రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి, గొల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు కరుణాకర్ రెడ్డి కార్యదర్శి సాయిని నరహరి సభ్యుడు తాడూరి సత్యం, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే..



**చురకలు ప్రతినిధి,కోరుట్ల,జనవరి 02 :** వృద్ధ తల్లిదండ్రులను నిరాదరిస్తున్న కొడుకులు,కోడళ్ళకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరిఅశోక్ కుమార్, కోరుట్ల డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందంలు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు.కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో డివిజన్‌లోని కోరుట్ల, కథలాపూర్,మేడిపల్లి మండలాలకు చెందిన వృద్ధులు చేసిన ఫిర్యాదులపై వారి కొడుకులను,కోడళ్ళను పిలిపించి వృద్ధ తల్లిదండ్రులను,అత్త మామలను పోషించకుండా వేధింపులకు నిరాధరణకు గురి చేస్తే వయోవృద్దుల ట్రిబ్యునల్ చైర్మన్, ఆర్డీవో 6 మాసాల జైలుశిక్షతో పాటు తల్లిదండ్రుల నుంచి తీసుకున్న ఆస్తులను తిరిగి స్వాధీనం చేస్తారని వారికి నచ్చ జెప్పారు.జగిత్యాల డివిజన్‌లో ఇద్దరికి పడ్డ శిక్ష లను వివరించారు.అనంతరం వారు ఒప్పంద పత్రాలు రాసిచ్చి తల్లి దండ్రుల ను వెంట తీసుకెళ్లారు.ఈ కౌన్సిలింగ్‌లో సీనియర్ సిటిజెన్స్ కౌన్సిలింగ్ అధికారులు పి.హన్మంత్ రెడ్డి, ఎన్.లక్ష్మి నారాయణ,ఎం.డి. సైఫోద్దీన్, విశ్వనాతం,సాంబమూర్తిలు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డికి పదోన్నతి




**చురకలు ప్రతినిధి, జగిత్యాల,ఫిబ్రవరి 2 :** జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డికి ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి అశోక్ కుమార్ చేతుల మీదుగా పిప్పింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ శేషాద్రినిరెడ్డి బుజాలపై స్టార్ చిహ్నాన్ని అలంకరించి అభినందిస్తూ, ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయిన సందర్భంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిచాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.

# కొనసాగుతున్న మల్లికార్జున స్వామి బ్రహోత్సవాలు

**-స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు**
**-భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం**
**-ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు,మహిళలు**





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఫిబ్రవరి (02) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని కేశాపుర్,కోజనకొత్తూర్ గ్రామలలో శ్రీ మల్లికార్జున స్వామి బ్రహోత్సవాలు అర్చకులు రోట్టె కిషన్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నయి.సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి వార్షికోత్సవ బ్రహోత్సవాలలో భాగంగా జాతర మహోత్సవం కన్నుల పండగా జరిగింది.ఉదయం మల్లికార్జున స్వామి పల్లకి ఊరేగింపుగా పల్లకిలో మల్లికార్జున దేవస్థానానికి తిసుకొని వచ్చారు.మల్లికార్జునస్వామి మాండాలమ్మ,కేతమ్మను గ్రామస్తులు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విధ్యసాగర్‌రావు దర్శించుకున్నారు. గ్రామస్తులు బోనాలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించి కోడే మొక్కలు, బెల్లంతో తులాభారం చేసుకున్నారు. ఉదయం అన్నదానం జరిగింది. రాత్రికి మల్లన్న ఒగ్గు కథ జరిగి అగ్నిగుండాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు చల్ల రక్షిత పురుషోతం,భోనగిరి స్వాతి భుమేశ్, నాయకులు నేమురి సత్యనారాయణ, దాసరి పోశెట్టి, ఉపసర్పంచ్ బజన్నోల శ్రీధర్,మీరా నాగార్జున,కలిగేటీ బోర్రన్న, కుడ సంజివ్,మల్లెష్,రాజేశ్వర్,శ్రీనివాస్ ,నాగేష్,రాము,మనోజ్, అనంత్,మధు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్రిక్తతకు దారి తీసిన కౌన్సిలర్ టిక్కెట్ వ్యవహారం

**-టిక్కెట్ కోసం ఒంటిపై డీజిల్ పోసుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనుచరుడు**
**-జగిత్యాల పట్టణంలో చోటుచేసుకున్న ఘటన**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఫిబ్రవరి 2 :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు ఎస్సీ జనరల్కు రిజర్వ్ అయింది. ఆ వార్డు నుండి బొల్లి శేఖర్ గత 20 ఏళ్లుగా మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ టిక్కెట్ను ఆశించారు. అయితే జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ల మధ్య కొ నసాగుతున్న రాజకీయ విబేధాలతో 16వ వార్డు టిక్కెట్ ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్కు కేటాయించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగుతుండటంతో తనకు టిక్కెట్ రాదేమోనని సోమవారం బొల్లి శేఖర్ పట్టణంలోని ఇందిరాభవన్ ఎదుట డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి బొల్లి శేఖర్ను అడ్డుకొని ప్రమాదాన్ని నివారించారు. అనంతరం బొల్లి శేఖర్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పని చె శానని, ఇప్పుడు తన వార్డులో తనకు అవకాశం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల వ్యవహారం పై స్పష్టత రాలేదు.

# తండ్రిబాటలో తనయ

**-22వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ "వడ్లూరి" కుమార్తె శ్రీలేఖ పోటీ**



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. కొన్ని వార్డుల్లో యువత గట్టి పోటీ ఇచ్చేలా కనిపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారం కొంతమంది తమ రాజకీయ వారసులను బరిలో దింపుతున్నారు. హుజురాబాద్లో మున్సిపల్ చైర్మన్ గా, వ్యాపారవేత్తగా ఉన్న వడ్లూరి విజయ్ కుమార్ కుమార్తె వడ్లూరి శ్రీలేఖను 22 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తోంది. ఆమె అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. విజయ్ కుమార్ గతంలో చైర్మన్ గా పనిచేసిన సమయంలో హుజురాబాద్లో మున్సిపల్ కాంప్లెక్సుల నిర్మాణం, రోడ్ల వెడేల్పు, స్మశాన వాటిక వంటి పనులు చేసి అందరిని ఆకర్షించారు. అయన తన కుమార్తె గెలుపుకోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఎలాగైనా తన కుమార్తెను గెలిపించుకోవాలని విజయ్ కుమార్ భావిస్తున్నారు. శ్రీలేఖ పోటీతో ఆ వార్డు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

**అక్కడ పోటీ ఆసక్తికరం**

హుజురాబాద్లోని ఆరవ వార్డులో ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ కుమార్తె, గ్రాడ్యుయేట్ బండ సింధూజ పోటీ చేస్తోంది. 20 వ వార్డులో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ దామెర అనూష బీజేపీ నుండి పోటీ చేస్తుండగా, యువకుడు పంజాల మనోజ్ (పంజాల కళాధర్ తనయుడు) 21 వ వార్డులో బీజేపీ నుండి, ఇదే వార్డులో గుర్రం హరిబాబు కాంగ్రెస్ నుండి పోటీలో ఉన్నారు. 30 వ వార్డులో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ రొంటాల సుహాసిని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తోంది. ఓ పోలీసు అధికారి చెల్లెలయిన సుహాసిని కాంగ్రెస్ బలపరుస్తున్న మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అనే ప్రచారం కూడా ఉంది. 11 వ వార్డునుండి తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్ కుమారుడు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ కొలిపాక అజయ్ బరిలో ఉన్నారు. ఈ వార్డుల్లో పోటీ అందరిని ఆకర్షిస్తోంది. అలాగే కాంగ్రెస్ నుండి జన్నోజు భాస్కర్, తొగరు సదానందం, బి ఆర్ ఎస్ నుండి వర్ధినేని రవీందర్ రావు ఆయా వార్డుల్లో పోటీ చేస్తున్నారు. ఈ వార్డులు కూడా ఆసక్తిని రేపుతున్నాయి.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఫిబ్రవరి 2 :** మల్లాపూర్ మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధిలో భాగంగా వివిధ ప్రభుత్వ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని కోరుతూ శాలువాలతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి,ఏఎంసి డైరెక్టర్ నల్ల శ్రీనివాస్,నాయకులు అంతడపుల నర్సయ్య, దప్పుల నర్సయ్య,మిల్కా నవీన్,సోమా నాగార్జున రెడ్డి,నాసం తిరుపతి, నత్తి రాము,రాజేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## జాబితాపూర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా సతీష్ ఏకగ్రీవ ఎన్నిక



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఫిబ్రవరి 2 :** జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా నక్క సతీష్ ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.గ్రామ యువత సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో ఇతర బాధ్యులను కూడా ఏకగ్రీవంగా ప్రకటించారు.ఉపాధ్యక్షులుగా నక్క వినోద్, ప్రధాన కార్యదర్శిగా ఈదుల గంగారాం, సహాయ కార్యదర్శిగా నీలం చంద్రశేఖర్, కోశాధికారిగా దొనకొండ అశోక్, ఆర్గనైజే కార్యదర్శిగా బొమ్మేన వంశీ,వీరితో పాటు మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నక్క సతీష్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు, గ్రామంలోని యువత ఐక్యతకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఈదుల రాములు,నలవాల గంగారం,నలవాల రాజన్న,గంగాధర మురళి,బేక్కం లక్ష్మణ్,నీల లక్ష్మణ్,నీలం నర్సయ్య, కొత్తూరు తిరుపతి,కొత్తూరు గంగాధర్, నీలం గంగపోసం,తదితరులు పాల్గొన్నారు.

## సైకత శిల్ప ప్రతిష్టారాధనకు ఆహ్వానం



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,ఫిబ్రవరి 2 :** కలియుగ వెంకటేశ్వర స్వామి 20 అడుగుల సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాల్సిందిగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ని నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 5 నుండి మార్చి 5 వరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎగ్జిభిషన్ గ్రౌండ్ లో నెలకొల్పే సైకత ఇసుకశిల్ప ఆరాధన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వేముల ఉమారాణి తెలిపారు.సోమవారం ఇందిరా భవన్‌లో కార్యక్రమ ప్రధాన ఆర్గనైజర్ వేముల ఉమారాణి మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి 3డి సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాలని ఆహ్వానం అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్,కళ్ళేపెల్లి దుర్గయ్య,వరప్రసాద్,వెంకట్ రెడ్డిలున్నారు.

# నిత్యం సాధన చేయాలి..విజయం సాధించాలి

**-టైమ్ టేబుల్ ప్రకారం చదవాలి**
**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల ప్రేరణ, అవగాహన తరగతులు ప్రారంభం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 02 :** పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై నిత్యం సాధన చేయాలని.. విజయం సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.ఎస్సీ సంక్షేమశాఖ ఆద్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ప్రేరణ, అవగాహన తరగతుల కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో సోమవారం ఏర్పాటు చేయగా,ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం విద్యార్థులతో ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు.ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని స్పష్టం చేశారు. ఇప్పుడు వచ్చిన మార్కులు భవిష్యత్తు చదువులకు ఎంతో ఉపయోగపడు తాయని వివరించారు.మూడు విషయాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని,ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం,రాయడం పూర్తి చేయాలని తెలిపారు. గత ప్రశ్నాపత్రాలు కూడా సాధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ స్టడీహవర్‌తో పాటుగా సెల్ఫ్ స్టడీ రోజు 3 నుంచి 4 గంటలపాటు చేయాలని సూచించారు.రైటింగ్ కూడా సాధన చేయాలని,వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు.ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులందరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా..ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం..అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు,వృత్తుల్లో స్థిరపడాలని,ఉన్నత స్థానాల్లో నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్,ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ టాపింగ్ కేసు ఆరోపణలపై విచారణ చేపడితే తప్పేంటి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** ఫోన్ టాపింగ్ కేసు ఆరోపణలపై మాజీ సీఎం కేసీఆర్ పై సిట్ అదికారుల విచారణ పారదర్శకంగా ఉంటుంది విచారణ చేపడితే తప్పేంటని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పద్మా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ కేసులో సిఎం రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు.కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునివ్వటంతో బొప్పాపూర్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అత్యుత్సాహంతో దుర్మార్గంగా సీఎం రేవంత్ రెడ్డిగారి దిష్టిబొమ్మకు గొర్రె తలకాయ పెట్టి దహన సంస్కరణలు చేయడం బిఆర్,ఎస్ పార్టీ నాయకుల అవివేకం అన్నారు,ఒక కులాన్ని కించపరిచే విధంగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు వివరించారని ఆయన ఆరోపించారు.యాదవులు ఓట్లు వేయలేదా వీరు చేసిన అరాచకాలు ఎన్నో ఉన్నాయన్నారు.జాగృతి అధ్యక్షురాలు కవితనే కెసిఆర్ కేటీఆర్ లపై దొంగలు అని ఆరోపణలు చేసిందని దొంగలను దొంగలు అని అనడం తప్పా అని ఆయన ప్రశ్నించారు , విచారణకు అందర్నీ పిలిచినట్టు కేసీఆర్ నుపిలిచారన్నారు,తప్పు చేస్తే శిక్ష తప్పకుండా అనుభవించాల్సిందేనని ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పద్ధతులు మార్చుకోవాలని లేకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు సాహెబ్, ఎఎంసి డైరెక్టర్ కిష్టారెడ్డి , బొప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముష్కం దత్తాద్రి గౌడ్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

**-అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్ పటేల్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే తెలంగాణ ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహించడం జరుగుతోందని అంతర్గతహసిల్దార్ తూము రవీందర్ పటేల్ అన్నారు. అంతర్గాం మండల కేంద్రంలోని టీఎస్ లో గల జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కబ్ ఆటల పోటీలను తూము రవీందర్ పటేల్ ప్రారంభించారు. ఇందులో కబడ్డీ కోకో మరియు వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో మట్టిలో మాణిక్యాలు ఉన్నారని వారిని ప్రోత్సహించి వారి నుండి ప్రతిభను తీయాలని అన్నారు. ముఖ్యంగా క్రీడల్లో ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయి క్రీడాకారులు గా మారతారని రాణిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి ఎంఈఓ ఏకాంబరం అంతర్గం సర్పంచ్ రవికుమార్ అని తిరుపతి మౌనిక నిర్మల ఈ క్రీడల్లో అంతర్గాం మరియు పొట్యాల గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.



## కేసుఅయితే అయ్యింది...
## గొర్రె తలకాయ ఏమైంది !

**-ఆందోళన అయ్యినంక కాల్చుకొని తిన్నారా**





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు అత్యుత్సాహంతో గొర్రె తలకాయ పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం ఫిబ్రవరి ఒకటవ తేదీన గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై దగ్ధం చేసి కేసుల పాలయ్యారు.దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు గొర్రె తలకాయను ఏం చేశారనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది.నిరసన కార్యక్రమం కోసం ఓ మటన్‌వ్యాపారి వద్ద తలకాయ కొనుగోలు చేసి తీసుకొని వచ్చి నిరసన కార్యక్రమం చేసి అనంతరం తలకాయను ఏ నాయకుడైతే తెచ్చినడో ఆ నాయకుడే ఇంటికి తీసుకెళ్లి కాల్చుకొని వండుకొని తిని ఉండవచ్చుననే చర్చా జరుగుతుంది.ఏది ఏమైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి కేసుల పాలయ్యారనే విమర్శలు వినబడుతున్నాయి.

## బిఆర్ఎస్ నాయకులు క్షమాపనలు చెప్పాలి

**-బొప్పాపూర్ యాదవ సంఘం డిమాండ్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** రాచర్ల బొప్పాపూర్ యాదవ సంఘం సభ్యులు ప్రెస్ మీట్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు గొర్రె పొట్టేలు బొమ్మను తగిలించి దహనం చేయడం యాదవుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయటమేనని ఆయన అన్నారు.యాదవులకు చిహ్నం మైన గొర్రెను ఇలా చేయడం మా యాదవ సమాజాన్ని కించపరచడమే “మీ పార్టీ ఆదేశాల మేరకు మీరు చేయవలసింది ఏమిటో చేసుకోండి“కానీ గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న యాదవుల ఆత్మభిమానం దెబ్బతీసేలా గొర్రె పొట్టేలు బొమ్మ తగిలించి మీరు చేసిన చర్యలు సమంజసం కాదు అన్నారు.దిష్టిబొమ్మకు గొర్రె పొట్టేలు బొమ్మ తగిలించి దహనం చేయడం చాలా బాధాకరమని అన్నారు.యాదవులను చిన్నచూపు చూస్తే సహించేది లేదని అన్నారు.ఈ వేంటనే క్షమాపణ చెప్పాలి లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తాం.ఈ కార్యక్రమం రాచర్ల బొప్పాపూర్ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గుండారం జాతర ఆదాయం 2,33,386



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** కమాన్‌పూర్ మండలం గుండారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయం 2,33,386 రూపాయలు ఆదాయం వచ్చినట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.గత నెల 28న సమ్మక్క తల్లి 29న సార్లమ్మ తల్లి రావడం జరిగింది.30న జాతర నిర్వహించగా జాతరలో వచ్చిన హుండీ ఆదాయం తెలిపారు.సమ్మక్క తల్లి హుండీలో 1,12,312 రూపాయలు,అలాగే సార్‌వాళ్ళ అమ్మ తల్లి హుండీలో 83, 684 రూపాయలు వచ్చాయి.పైడికి రాజు హుండీలో 17,290 రూపాయలు 20,100రూపాయలు టెండర్ ద్వారా వచ్చాయి.దీంతో జాతర పూర్తి స్థాయిలో ముగిసింది.బుధవారం రోజున శ్రీసమ్మక్క సారమ్మ తల్లి తిరుగువారం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు గొర్రె తలకాయ పెట్టి దగ్ధం

## -13 మందిపై కేసు నమోదు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపురం గ్రామంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మకు గొర్రె తలకాయ పెట్టి అవమానపరిచి దగ్ధం చేసిన కేసులో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు.రాజన్న బొప్పాపూర్ గ్రామంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి గారి దిష్టి బొమ్మకు గొర్రె తలకాయ పెట్టి దగ్ధం చేసి గొల్ల కురుమ యాదవులను అవమాన పరిచినారని ఏఎంసి డైరెక్టర్, ఎల్లారెడ్డిపేట వీర్నపల్లి మండలాల గొల్ల కురుమ యాదవ సంఘం అధ్యక్షులు మెండే శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘానికి చెందిన ప్రతినిధులు వెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వంగ శివరాంరెడ్డి ఇల్లందుల శ్రీనివాసరెడ్డి మొడుసు దేవా రెడ్డి,ల్యాగల సతీష్ రెడ్డి,బొమ్మనవేని సత్యం ఇర్ఫాన్, అశ్వక్,బుర్రవేణి నాగరాజు,శ్రీధర్ ముత్యాల చంద్రారెడ్డి నీరటీ రాజు, మొడుసు రజినీకాంతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు.

# కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం

## -కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** కలిసికట్టుగా కలవచర్ల గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం అని గ్రామ సర్పంచ్ వేళ్ళ శారద కుమార స్వామి అన్నారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి యొక్క సమస్యలను సర్పంచ్‌కి వినతి పత్రం అందజేశారు. విద్యా వైద్య నివాసం రోడ్డు సంబంధింత విషయాలపై అవగాహన కల్పించిన సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి వి ఓఏ భవనాల కోసం తగిన స్థలం ఇవ్వడం మరియు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం అని ప్రసంగించారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా సిసి కెమెరాలు 5.1 మైక్ స్పీకర్ సదుపాయంతో ఏర్పాటు చేస్తున్నామని ఇట్టి కెమెరాలు పోలీస్ డిపార్ట్మెంట్ మరియు గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయబడి ఉంటుంది అని ప్రసంగించారు.ఇట్టి కెమెరాలు గ్రామ పంచాయతీ నిధులతో గత పాలకులు 3,00,000లక్షల రూపాయలతో 20కెమెరాలు పెట్టించారు.కానీ అవి కొద్ది రోజులవరకే ఉపయోగంలో ఉన్నాయి.మళ్ళీ గ్రామపంచాయతీ నిధులలో నుండి తీసుకోవడానికి అవకాశం లేదు కాబట్టి దాతల సహాయం చేత ఏర్పాటు చేయిస్తున్నాం అని వెల్లడించారు. సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మాట్లాడుతూ అధివృద్దే మా ధ్యేయం అని ప్రత్యేకంగా వేసవి కాలంలో నీరు సమస్య ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటామని డ్రైనేజ్ మరియు వీధి లైట్స్ విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటామని రాళ్ళమాటు స్మశాన వాటికలో నీటి సదుపాయం కరెంట్ సరఫరా కోసం మీటర్ వచ్చిందని సిసి రోడ్డు లైటింగ్ మరియు అంతిమ సంస్కారాలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని మరియు బొక్కల వాగు దగ్గర ఉన్న శ్మశాన వాటికలో సిసి రోడ్ నిర్మాణం చేస్తామని చెప్పారు.మురికి కాలువలు శుభ్రం చేసి దోమల నివారణ మరియు ఆరోగ్య సంరక్షణ పరిసరాల పరిశుభ్రత పాటించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.చెత్త పడేయడానికి సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణం చేపట్టాలని గ్రామ పంచాయతీ లో గల పాత సెగ్రిగేషన్ షెడ్ దూరంగా ఉన్న కారణంగా దగ్గర ప్రాంతంలో నిర్మించాలని కూడా ప్రసంగించారు. దోమల నివారణ మరియు ఆరోగ్య సంరక్షణ పరిసరాల పరిశుభ్రత పాటించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.జీ.పిఓ : తిరుపతమ్మ మాట్లాడుతూ అభివృద్ధి పదం వైపు గ్రామం నడవాల్సిందిగా అందులో భాగంగా తమ యొక్క సేవలు అనగా భూమి రికార్డ్‌లు సమర్పించడం మరియు కళ్యాణ లక్ష్మి లాంటి తదితర పథకాల అవగాహన కల్పించారు.ఏఈఓ అరవింద్ మాట్లాడుతూ పలు వ్యవసాయ వృత్తుల పంటల 1960 ఎకరాలు ఉన్నాయని ప్రస్తుతం నాట్లు 80 శాతం పూర్తి అయినట్టు మరియు పంట సాగులో కలిగే అవాంతరాలు అయిన అగ్గి తెగులు కాండం తొలుచు పురుగు తదితర సమస్యల గురించి వ్యక్తం చేశారు.గ్రామ ప్రజలకు వ్యవసాయ రంగంలో ఎటువంటి సందేహాలకైనా సమస్యలకైనా పరిష్కారం తమ వైపు నుండి ఉంటుంది అని వెల్లడించారు.

**కల్వచర్ల గ్రామ సభ ముఖ్య అతిధి రామగిరి ఎస్ ఐ శ్రీనివాస్**

కల్వచర్ల గ్రామంలో జరిగిన గ్రామ సభలో ముక్య అతిధిగా వ్యవహరించిన రామగిరి ఎస్ ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనాల విషయంలో జాగ్రత్త వహించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు .గ్రామంలో సీ సి కెమెరాలు ఏర్పాట్లకు దాతల సహాయం చేత ఏర్పాటు చేయిస్తున్నాం అని గ్రామ పంచాయతీ నిధులు ఉపయోగించ కూడదనే నేపథ్యంతో దాతల సహాయరీత్యా పనులు శరవేగంగా జరుగుతున్నాయి అని వెల్లడించారు.సిసి కెమెరాల విరాళాలకై తమ స్టేషన్ లో గల ముగ్గురు కానిస్టేబుల్ లను సహాయ సహకారాల నిమిత్తం పంపిస్తామని గ్రామ ప్రజలకు మాట ఇచ్చారు మరియు అత్యంత ప్రధానమైన సమస్య డ్రగ్స్(గంజాయి)వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుంది అని అవగాహన కల్పించారు.ఇందుకు సంబంధించిన సమాచారం గ్రామ ప్రజలు తప్పకుండా అందిస్తే మేము తగిన చర్యలు తీసుకుంటామని అందుకు సంబంధించిన శిక్ష మరియు పునరావాస కేంద్రానికి (రిహాబిటేషన్) పంపించి డ్రగ్స్(గంజాయి మరియు మాదక ద్రవ్యాలు) కి బానిసగా మారిన వాళ్ళ పట్ల తగు చర్యలు తీసుకోగలమని ఎస్ ఐ శ్రీనివాస్ వెల్లడించారు.కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ వారి అనుభవంలో సంవత్సరం చేయవలసిన పనిని ఒక్క నెలలో చేసి చూపించిన కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి గారికి మరియు పాలక వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమానికి రామగిరి ఎస్ఐ శ్రీనివాస్,ఏఎస్ఐ స్వామి,ఏఈఓ అరవింద్,జిపిఓ తిరుపతమ్మ,ఎం ఎల్ హెచ్ పి దేవేందర్ రెడ్డి,ఏఎన్ఎం తార,ఆశా వర్కర్లు,వి ఓ ఏ లు,విద్యుత్ శాఖ లైన్‌మెన్ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఇంట్రా ఏఈశృతి, మాజీ సర్పంచ్ బొల్లవరం భాస్కర్‌రావు ,వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

# ఆదివరహ స్వామిని దర్శించుకున్న ప్రముఖ వైద్యులు

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణ చారి కమాన్ పూర్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆది వరహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. రమణాచారిని హర్ష అయ్యగారు స్వాగతం పలికి వేద మంత్రాల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి వద్ద డాక్టర్ రమణాచారి కుటుంబ సమేతంగా అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ చారి కి ఆలయం తరఫున శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ శ్రీ ఆది వరహాస్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కల్వల సంతు, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.



# అక్కపల్లిలో రసా బసగా మారిన గ్రామసభ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిఫేట ఫిబ్రవరి 02 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం గ్రామ సర్పంచ్ మాదాసు స్రవంతి అధ్యక్షతన గ్రామసభ జరిగింది.గ్రామంలో బెల్టు షాపులపై నిషేధం విధించారు.గ్రామం నుండి ఇసుక కానీ మట్టి కానీ ఇతర గ్రామాలకు తీసుకుపోరాదని గ్రామ సభలో తీర్మానం చేశారు ఎవరైనా అక్క పెల్లి నుండి బయట విలేజ్‌లకు ఇసుక తరలించినట్టు ఎవరైనా చూసి చెబితే 5000 రూపాయలు పారితోషికం ఇస్తామని గ్రామసభలో తీర్మానం చేశారు ఇసుక తీసుకెళ్లిన వారికి 50 వేల రూపాయల జరిమానా విధించనున్నట్టు తెలిపారు, గత పది సంవత్సరాలుగా నిలిచిపోయిన స్కూల్ చిట్టిని ప్రారంభించాలని గ్రామస్తులు తీర్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందాటి బాబు పాలకవర్గం గ్రామ పంచాయతీ సెక్రెటరీ పవిత్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు శ్రద్ధాంజలి ఘటించిన ఎక్సైజ్ సిబ్బంది



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** నిజమాబాద్ జిల్లా కేంద్రంలో జనవరి 23 న గంజాయి అక్రమ రవాణా దారులు వానంతో డికొట్టితొక్కిం చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (25) నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించింది.ఈ సందర్భంగా ఆమె చిత్ర పటాన్ని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్లో ఎక్సైజ్ సిబ్బంది ఏర్పాటుచేసి కోవ్వత్తులు వెలిగించి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.ఎక్సైజ్ సిబ్బంది మాట్లాడుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆక్రమంగా గంజాయి తరలిస్తున్న మూటను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం ఆమే లెక్కచేయలేదన్నారు.ఈ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడి చికిత్స పొందుతూ చివరకు మరణించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఎక్సైజ్ ట్రైనింగ్ ఎస్ఐ సంతోష్ కుమార్,ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజు రాజేందర్ దివ్య కిషోర్ వర్మలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రహీంను పరామర్శించిన నాయకులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 02 :** గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన గంభీరావుపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ రహీం గారి తల్లి ఇటీవల మరణించగా రహీం ను బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు.మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఎగదండి స్వామి ఎగదండి అర్జున్ సీనియర్ నాయకులు బార ధనరాజ్ భోగన్న గారి రాజనర్సయ్య ఎగదండి అరుణ్ సన్నీ గాదం ఆదిత్య తదితరులు రహింను పరామర్శించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం

**-మారుమోగిన భక్తుల గోవిందనామ స్మరణ**
**-స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 02 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గుట్టపై వెలిసిన స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవ వేడుక అశేష భక్త జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా అలంకరిం చిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అర్చకులు పట్టువస్త్రాలతో అలంకరించి గుట్టపైనుండి రథం వద్దకు మేళతాలాలతో తీసుకవచ్చి రథంపైఆశీనులనుచేసి ఆలయ ఆవరణలో తిరుగాడింప జేయగా భక్త జనులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొనిఆనంద పరవశులయ్యారు.స్వామివారు రథంపై తిరుగాడగా భక్తులుచేసిన గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.సోమవారం ఉదయం నుండే స్వామివారిని దర్శించు కోవడానికి చుట్టుపక్క గ్రామాలే కాకుండా సూదూర ప్రాంతాలనుండి అధికసంఖ్యలో భక్తులు పోటెత్తారు.క్యూ లైన్లు భక్తులతోకిటకిటలాడాయి.స్వామి వారి దర్శనానంతరం భక్తు లు అక్కడే వంటావార్పు చేసుకొని సాయంత్రం రథోత్సవంలో పాల్గొన్నారు. ప్రతియేడు కంటే ఈ సారి భక్తులు అధికసంఖ్యలో రావడంవిశేషం. అయిదురోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌఖర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య ధర్మకర్తలు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు.స్వామివారి దర్శనానికి క్యూ లైన్ల లో వచ్చే భక్తులకు ఇబ్బంది కలగ కుండా పోలీసు సిబ్బంది,వాలంటీర్లు సేవలందించారు.ఆలయ ప్రాంగణంలో భక్తి సంగీత విభా వరి ఏర్పాటు చేసి భక్తులకు వీనుల విందు చేశారు.ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ భూపెల్లి రాజయ్య, ఉపసర్పంచ్,యాగం డ్ల గంగయ్య, వార్డు సభ్యులు, అర్చకులు ,ప్రజాప్రతినిధులు ,పురప్రముఖులు, యువకులు,భక్తులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ గౌడ్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 2 :** ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్. రాజ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ -2010 యొక్క జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజగౌడ్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ కచ్చితంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్ సమయంలో పొందుపరిచిన డాక్టర్స్, పారామెడికల్ స్టాఫ్ మాత్రమే సేవలు అందించాలని,ఎవరైనా వెళ్ళిపోయిన కానీ కొత్తగా చేరినచో డాక్టర్లను గాని స్టాఫ్‌ను గాని ఆడ్ చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయించుకోవాలని,చట్టంలో పొందుపరిచిన అంశాలను అన్ని దవాఖానాలు పాటించాలని తెలిపారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రోగ్రాం ఆఫీసర్స్కు డివిజన్ల వారిగా కొన్ని హాస్పిటల్స్ కేటాయించి ఎల్లప్పుడూ వారిని తనిఖీ చేయాలని ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ స్పెషల్ బ్రాంచ్ వెంకటరమణ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పర్యవేక్షకులు కుతుబుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

**-చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** విద్యార్థుల్లో పోటీ తత్వం ఉన్నప్పుడే ఉన్నత ర్యాంకులు సాధిస్తారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారంప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' అను పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ 10వ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని,ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. మొట్ట మొదటి స్థానాన్ని పొందిన విద్యార్థికి రూ.5 లక్షలు,రెండవ స్థానానికి రూ.3 లక్షలు,ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు,119 అసెంబ్లీ ప్రతి నియోజక వర్గ టాపర్‌కు రూ.1లక్ష చొప్పున,అలాగే 612 మండలాలలో టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయ నున్నట్లు తెలిపారు.ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ గంగాధర బ్రాంచ్ మేనేజర్ వేములవాడ అజయ్, ,సిబ్బంది పోరండ్ల భూపతి, డీవో మంత్రి మహేందర్, గోపాలరావు పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,సువీన్ యాదవ్, ఆంజనేయులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకులు సరసమైన ధరలో అందించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 2 :** ప్రజలకు నిత్యావసర సరుకులు సరసమైన మరియు నాణ్యమైన ధరలో అందించాలి అని కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ అన్నారు. కమాన్ పూర్ క్రాస్ రోడ్ వద్ద గల టౌన్ మార్ట్ ఆధ్వర్యంలో గత సంక్రాంతికి వెయ్యి రూపాయల నిత్యవసర సరుకులు కొన్న వారికి కూపన్లు పంపిణీ చేశారు. ఆయా కూపన్ లో ఆదివారం విప్పి ఎస్సై కొట్టే ప్రసాద్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఇందులో మొదటి బహుమతి టి రమేష్ (మిక్సీ) కమాన్ పూర్, రెండవ బహుమతి ఎన్ సంతోష్ కిష్టం పల్లె (కుక్కర్) కే రమ రాజాపూర్ (డిన్నర్ సెట్) ఎస్సై వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో షాపింగ్ లు ఏర్పాటు చేసి ప్రజలకు చౌకగా మరియు నాణ్యత గల వస్తువులు అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్ట్ యజమాని ముద్దసాని నాగరాజు, పోలీస్ సిబ్బంది మల్లయ్య, మరియు శ్రీనివాస్ తో పాటు పిడుగు సారిక తదితరులు పాల్గొన్నారు.

# రేచపల్లిలో బ్యాంక్ ఏర్పాటు చేయాలి

**-టిజిబి రీజినల్ మేనేజర్‌కు సర్పంచ్ మహేష్ వినతి**



**చురకలు విలేఖరి,జగిత్యాల,ఫిబ్రవరి 02 :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని ఉమ్మడి రేచపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌ను మంజూరు చేయాలని రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ జగిత్యాల జిల్లా బ్యాంక్ రీజినల్ మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు. ఉమ్మడి రేచపల్లి పరిధిలో 10 వేల మందికి పైగా జనాభా, 57 వేల క్రియాశీల బ్యాంకు ఖాతాలు,5వేల ఎకరాలకు పైగా వ్యవసాయ పట్టా భూములు ఉన్నాయని తెలిపారు.అలాగే 105 డ్వాక్రా స్వశక్తి మహిళా సంఘాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఇంత పెద్ద గ్రామంలో ఇప్పటివరకు ఒక్క బ్యాంకు శాఖ కూడా లేకపోవడం వల్ల రైతులు,మహిళలు,వృద్ధులు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.పంట రుణాలు,కిసాన్ క్రెడిట్ కార్డులు, డీబీటీ పథకాలు సక్రమంగా అందకపోతున్నాయని తెలిపారు. ఆర్బిఐ, ఎస్ఎల్బీసీ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు గ్రామం పూర్తిస్థాయి అర్హత కలిగి ఉందని పేర్కొంటూ, సంబంధిత అధికారులు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని సర్పంచ్ మహేష్ వినతి పత్రంలో కోరారని తెలిపారు.

# అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**-మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 2 :** హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అధికారంలో కాంగ్రెస్ ఉందని తమ పార్టీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమ వారం స్థానిక పట్టణంలోని పలు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వదిస్తే మరింత బాధ్యతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తొగరు సదానందం,కొలిపాక శంకర్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బుగ్గారం పోచమ్మల జాతర - రథోత్సవం

**-తండోప తండాలుగా తరలివచ్చిన భక్త జనం**
**-వివిధ జిల్లాలతో పాటు అంతర్ రాష్ట్రాల నుండి వచ్చి మొక్కలు తీర్చుకున్న భక్తులు**



**చురకలు విలేఖరి,బుగ్గారం, ఫిబ్రవరి, 2 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం శ్రీ ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మ ల జాతర-రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.తండోప తండాలుగా భక్త జనం వివిధ జిల్లాల నుండి,అంతర్ రాష్ట్రాల నుండి వేలాదిగా తరలి వచ్చారు.ఆలయ కమిటి చైర్మన్ మసర్తి నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు భారీగా ఏర్పాట్లు చేశారు.భక్తులకు అన్నదానం నిర్వహించారు.దావతోళ్ల విన్యాసాలు, ఒగ్గు కళాకారులు, డప్పు కళాకారులు నిర్వహించిన నృత్యాలు,కళాప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటి చైర్మన్ మసర్తి నర్సయ్య తనయుడు నరేష్ దంపతులు శ్రీ ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మ లకు ప్రత్యేకంగా వండిన బోనాలను ఊరేగింపుగా తీసుకు వెళ్ళి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు.దావతోళ్లు రంగు - రంగుల పిండితో వేసిన ముగ్గులు (పట్టు),అన్నంతో ఏర్పాటు చేసిన దిష్టి కుంభం,ప్రకృతి పరమైన పూలతో నిర్వహించిన రథం యొక్క అలంకరణ భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.జాతరకు విచ్చేసిన భక్త జనం,ప్రత్యేకంగా సుదూర ప్రాంతాల నుండి పోచమ్మ తల్లుల జాతర కోసం మాత్రమే తరలి వచ్చిన భక్త జనం అమ్మవార్లను దర్శించుకొని వారి - వారి మొక్కలు తీర్చుకున్నారు.కట్న కానుకలు సమర్పించి వారి భక్తిని చాటు కున్నారు. బుగ్గారం ఎస్సై జి.సతీష్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బలగాలు,పోలీస్ సిబ్బంది తగిన చర్యలు తీసుకొని బందోబస్తు నిర్వహించారు.భక్తుల వాహనాలను ప్రత్యేక స్థలాలలో పార్కింగ్ చేయించి ట్రాపిక్ ఇబ్బందుల ను నియత్రించారు. హమాలి సంఘం వారు, ఆలయాల కమిటి సభ్యులు, కార్యవర్గం ప్రత్యేక కృషి సలిపినారు. ఉచిత సేవలను అందజేసి రుచి - శుచి కరమైన వంటకాలు చేసి కూరగాయల భోజనాలతో అన్నదానం చాలా గొప్పగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ-రాజయ్య,ఉప సర్పంచ్ జంగ లావణ్య-శ్రీనివాస్‌లతో పాటు పాలక వర్గం వార్డ్ సభ్యులు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ప్రముఖులు,వివిధ రాజకీయ పార్టీల నేతలు,తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి,కాంగ్రెస్,టిడిపి,డీఎస్పీ మండల పార్టీల అధ్యక్షులు వేముల సుభాష్,పెద్దనవేని రాగన్న,దూడ పోచ రాజయ్య,మాజీ సర్పంచ్‌లు మసర్తి రాజారెడ్డి,లక్ష్మి,మూల సుమలత - శ్రీనివాస్,నాయకులు శంకర్,రాజన్న, సత్తన్న,మల్లయ్యా, మల్లేశం,పోచమల్లు తదితరులతో పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు,మహిళలు స్వయంగా అమ్మవార్ల రథాన్నిలాగి వారి భక్తిని చాటుకున్నారు.



# మున్సిపోల్స్ "బీ" ఫారాలొస్తున్నాయ్..

**-నేటితో ముగియనున్న నామినేషన్ల "ఉపసంహరణ"**
**-పోటీలో ఎంతమందో తేలేది నేడే**




**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టాలైన నామినేషన్ల ఉపసంహరణకు, బీ ఫారాల సమర్పణకు మంగళవారం తో గడువు తీరనుంది.మధ్యాహ్నం 3.30 గంటల లోపు ఉపసంహరణతో పాటు బి ఫారాలను సమర్పించాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరుగుతున్న విషయం తెలిసిందే. ఇవి పూర్తయితే.. ఒక్కో వార్డులో ఎంతమంది బరిలో ఉన్నారనే విషయంతోపాటు వారి గుర్తులు కూడా ఖరారుకానున్నాయి. రాజకీయ పార్టీలు బి ఫారాలు సమర్పించేందుకు సన్నద్ధం అయ్యాయి. ప్రధాన పార్టీల నుండి ఎవరెవరు అభ్యర్థులు పోటీ చేస్తారనేది ఓ అరవై శాతం వరకు క్లారిటీ వచ్చింది. కానీ మరికొన్ని స్థానాల్లో ఇంకా తర్జన భర్జన జరుగుతోంది. కొన్ని వార్డుల్లో ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు టికెట్లు ఆశిస్తుండడంతో.. వివాదాలు చెలరేగుతున్నాయి.వీటిని పరిష్కరించడం పార్టీనేతలకు తలనొప్పిలా మారింది. కొందరు పార్టీ పేరుతోపాటు ఇండిపెండెంట్లుగా కూడా నామినేషన్లు వేశారు. అయితే టికెట్ రాని అభ్యర్థులు పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నామినేషన్లు ఉపసంహరించుకుంటారా? లేక రెబెల్స్ గా బరిలో ఉంటారా అన్నది నేడు తేలుతుంది.

**కనిపించని యువత జోష్, కొత్తముఖాలు**

హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో యువత జోష్ పెద్దగా కనిపించడం లేదు. 21 ఏళ్ళు నిండిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు. ఇక్కడ నామినేషన్లను, అలాగే పోటీని పరిశీలిస్తే.. కొన్ని పాత, సీనియర్ ముఖాలే కన్పిస్తున్నాయి. 21 నుండి 30 ఏళ్ల వయసున్న యూత్ ఎన్నికల్లో పోటీకి పెద్దగా స్పందించలేదని తెలుస్తోంది. ఒకటి రెండు వార్డుల్లో యువత, నడి వయస్కులు (మిడిల్ ఏజ్డ్) బరిలో నిలిచారు. అలాగే కొత్త ముఖాలు కూడా తక్కువగానే ఉన్నాయి. దాదాపు అన్ని వార్డుల్లో ఇప్పటికే రాజకీయాల్లో ఉన్నవారే పోటీ చేస్తున్నారు. యువతలో ఉన్న నిస్తేజాన్ని, రాజకీయాలపై వారికున్న విస్మయాన్ని ఈ ఎన్నికలు సూచిస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఎక్కడైనా డబ్బు ముచ్చటే..**

మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడైనా డబ్బుముచ్చటే నడుస్తోంది.పార్టీ నేతలు కూడా అభ్యర్థులను ఎంపిక చేసే ముందు మొదట "డబ్బు"విషయాన్నే ప్రస్తావించినట్లు తెలుస్తోంది."ఎంత పెట్టుకోగలుగుతావ్?..ఖర్చుకు వెనుకాడొద్దు...ఆలాగైతేనే ముందుకు పోటీ చెయ్..పార్టీ నుండి ఏదో వస్తుందని ఆశపడొద్దు..ఆలోచించుకో.. "అని నిర్మొహమాటంగా నేతలు చెప్పినట్లు సమాచారం.అభ్యర్థుల ఎంపిక జరిగినచోట ఇప్పటికే దావత్ లు ముమ్మరం అయ్యాయి. ఓటర్లను మేనేజ్ చేయడం ప్రారంభమైంది. ఒక్కోవార్డులో గెలవాలనుకునే అభ్యర్థి ఓటుకు రూ. 2 వేల నుండి 5 వేల వరకు ఖర్చు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీ ఎక్కువగా ఉన్న వార్డుల్లో ఓటుకు రూ. 10 వేల వరకు ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ వెరసి డబ్బులేని సామాన్యులు ఎన్నికలు అన్న పదం ఉచ్చరించేందుకు జంకే పరిస్థితి నెలకొంది.ఇక్కడ ఓట్లు ఉండి స్థానికంగాలేని అభ్యర్థులను హనుమకొండ,కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల నుండి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.వారికి "అన్ని రకాల"ఖర్చులు భరిస్తామని చెబుతు న్నారు.ప్రతి ఓటు ముఖ్యమైనది గా భావిస్తున్నారు.అలాగే ఆయా వార్డుల్లో అభ్యర్థుల సామాజిక వర్గాలను బట్టి సమీకరణలు పార్టీలు జరుపుతున్నాయి.

**ఆ నేతలకు సవాలే..**

హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో మెజారిటీ వార్డులకు కైవసం చేసుకుని చైర్మన్ పీఠం కైవసం చేసుకోవడం స్థానిక నియోజకవర్గ నేతలకు సవాల్ గా మారింది. బి ఆర్ ఎస్ నుండి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ నుండి వొడితల ప్రణవ్, బీజేపీ నేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ లకు సవాల్ గా మారుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం కోసం ఎమ్మెల్యే కౌశిక్, ప్రణవ్ వారి పార్టీల తరపున ఇప్పటికే రంగంలోకి దిగారు. నేడు బి ఫారాల సమర్పణ,అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరిగితే..ఈనెల 9 వరకు ప్రచారం ఉధృతంగా సాగనుంది.11న ఎన్నిక,13న కౌంటింగ్ జరగనుంది.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు



**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 02 :** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (ఫిబ్రవరి 1వ తేది నుండి 28 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు,ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్ లు,సభలు,సమావేశాలు నిర్వహించరదాని,నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు.శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా,ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సీపీ సమీక్ష



**-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి సభా ప్రాంగణ పరిశీలన**

**చురకలు క్రైమ్ ప్రతినిధి కరీంనగర్, ఫిబ్రవరి 2 :** ఈ నెల 5న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా పర్యటనను పురస్కరించుకుని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ సభా ప్రాంగణం, హెలిపాడ్ తో పాటు పార్కింగ్ స్థలాలను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ముఖ్య అంశాలు :**

**బారికేడ్ల ఏర్పాటు:** సభా ప్రాంగణ మ్యాప్ ఆధారంగా భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, బారికేడ్ల నిర్మాణ శైలిని సీపీ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బారికేడ్ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**డ్రోన్ నిఘా :** సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు మరియు భౌగోళిక పరిస్థితులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వివరించారు.

**ట్రాఫిక్ , పార్కింగ్:** సభకు వచ్చే వాహనాల కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

**భద్రత :** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని,ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సీపీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

